క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కపిలేశ్వరపురం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని సూచించారు.

విజయదుర్గా పీఠంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణ మంగళవారం పూజలు నిర్వహించారు. పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో నయనానందకరంగా అలంకరించారు. భక్తులు సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, బలిజేపల్లి రమ, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం


కపిలేశ్వరపురంలో కాలిపోయిన ఇల్లు, సామగ్రి

కపిలేశ్వరపురం: గ్రామ శివారు సత్యనారాయణపురం అగ్రహారంలో మంగళవారం ఉదయం సిలిండర్ నుంచి గ్యాస్ లీకై తాటాకిల్లు దగ్ధమైంది. స్థానిక వాటాల స్యూనారాయణకు చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధం కావడంతో రూ.30 వేలు ఆస్తినష్టం వాటిల్లింది. మండపేట అగ్నిమాపక అధికారి ఎం.వెంకట్రావు ఆధ్వర్యంలోని సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ అధికారి వెంకట్రావు తెలిపిన సమాచారం ప్రకారం.. ఈ ప్రమాదంలో ఇల్లు మొత్తం కాలిపోయింది.

బాధితుడు సూర్యనారాయణ కుమారుడు పోసయ్య సమీపంలో నివాసం ఉంటున్నారు. పోసయ్య పెద్ద కుమార్తె వివాహం గురువారం కావాల్సి ఉండగా సోమవారం పెళ్లి కూతురును చేశారు. పెళ్లికి సంబంధించిన సామాన్లు, ఇంటిలోని ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సంఘటన స్థలాన్ని ఆర్ఐ అర్జమ్మ, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. తక్షణ సాయంగా 25 కిలోల బియ్యం అందజేశారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కాజులూరు: రజకులను ఎస్సీ జాబితాలో చేర్పించాలని జిల్లా రజక సంఘం ఉపాధ్యక్షుడు కురవాడ కొండబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఆర్యావటంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రజక వృత్తికి ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో రజకులకు జీవనోపాధి లోపించిందని ఫలితంగా కొందరు ప్రత్యామ్నాయ వృత్తులకు మళ్లుతున్నారన్నారు. మరే ఇతర పనులు చేతకాని కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో వృత్తిని కొనసాగించాల్సి వస్తుందన్నారు. గతంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చుతామని మాట ఇచ్చి మోసం చేశారని ఈ సారైనా అది అమలు చేయాలన్నారు.

మనోహర్ మృతికి ప్రజా సంఘాల సంతాపం


మనోహర్ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, సేవలందించిన కామ్రేడ్ మనోహర్ ఆకస్మిక మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, పీవైఎల్ నాయకుడు అంబటి కృష్ణ, అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి మంగళవారం సంయుక్త ప్రకటనలో సంతాపం తెలిపారు. కామ్రేడ్ మనోహర్ విద్యార్థి దశ నుంచే ప్రజాసేవను తన జీవన విధానంగా చేసుకున్నాడని, విద్యార్థులు, రైతులు, రైతు కూలీల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసి ఎందరికో మేలు చేకూర్చారన్నారు. ప్రజా సంఘాలు, విప్లవ శక్తుల ఐక్యతకు నిరంతరం కృషి చేసేవారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.23 వేల విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పెనుగొండ మండలం ఇలపర్రు గ్రామానికి చెందిన పెనుమత్స చిట్టి రామసత్య సూర్యనారాయణ రాజు మంగళవారం రూ.23,000 విరాళం అందజేశారు. దాత ఈ సొమ్ము ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను అర్చకుడు వేద మంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది అభినందించారు.

ఆదిలోనే అవస్థలు

- అతివృష్టి, అనావృష్టితో ఖరీఫ్‌లో రైతులకు కష్టాలు
- భారీ వర్షాలతో ఆందోళన చెందుతున్న అన్నదాత
- రెండు నియోజకవర్గాల్లో 1,00,130 ఎకరాల్లో వరిసాగు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: ఖరీఫ్ సాగు చేస్తున్న అన్నదాతలను ఆదిలోనే కష్టాలు చుట్టుముట్టాయి. కోటి ఆశలతో నాట్లు వేసిన రైతులు ప్రతికూల వాతావరణంతో ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు పడకపోవడంతో ఖరీఫ్ సాగు ఆలస్యమైంది. బోర్లు, కాలువల కింద అష్టకష్టాలు పడి సాగు చేసిన రైతులు ప్రస్తుతం ప్రతికూల వాతావరణంతో ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్దగా నష్టం లేకపోయినప్పటికీ ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు కొనసాగితే పంట ముంపుబారిన పడుతుంది. భారీ వర్షాలకు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. ఆకస్మికంగా కురిసే వర్షాల నుంచి వరి పంటను కాపాడుకునే పద్ధతులపై రైతుకు అవగాహన అవసరం. ఆ మేరకు ఈ కథనం...

రెండు నియోజకవర్గాల్లో సాగు

రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 44,365 మంది రైతులు 53,821 ఎకరాల్లో వరి సాగు చేసున్నారు. మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 37,622 మంది రైతులు 46,309 ఎకరాల్లో వరి సాగుకు పూనుకున్నారు. మొత్తం రెండు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో 81,987 మంది రైతులు 1,00,130 ఎకరాల్లో వరి పంటను సాగు చేసున్నారు.

పిలకలు వేసే దశలో పంట

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పంట నీట మునిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ వరి సాగు విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజారాణి, సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ పంట రక్షణకు సంబంధించి నిర్దిష్టమైన సూచనలను చేసినట్టు కపిలేశ్వరపురం ఏఓ బలుసు రవి తెలిపారు. ప్రస్తుతం పంట ఊడ్చిన దశ నుంచి పిలకలు వేసే దశలో ఉంది. ఎంటీయూ 1318, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. వీటికి సుమారు ఐదు రోజులు వరకూ ముంపును తట్టుకునే సామర్థ్యం ఉంది. నీట మునిగి చనిపోతే వెంటనే మనేదలు వేసుకోవాలి.

పంట నీట మునిగితే..

నారుమడిలో విత్తనం చల్లిన వెంటనే నీట మునిగితే మొలక శాతం తగ్గుతుంది. వీలైనంత త్వరగా మడిలో నుంచి నీరు బయటకు పంపించి పొలాన్ని ఆరగట్టాలి. నారుమడి పూర్తిగా దెబ్బతింటే అందుబాటులో ఉన్న స్వల్పకాలిక రకాలను ప్రత్యామ్నాయంగా విత్తుకోవడం మేలు. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారు 5 రోజుల కన్నా ఎక్కువ మునిగితే నారు దెబ్బతింటుంది. నీరును బయటకు పంపించి 5 సెంట్ల నారుమడికి 1.0 కిలోల యూరియా, ఒక కిలో పొటాష్ చల్లాలి. ప్రస్తుత వాతావరణంలో ఆశించే తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బెన్డిజమ్‌ను కానీ రెండు గ్రాములు కార్బెన్డిజమ్‌తో పాటు మాంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని కానీ పిచికారీ చేసుకోవాలి.

పిలకల దశలో మునిగితే

పిలకల దశలో సాధారణ రకాలు 5 రోజుల వరకూ, ఎంటీయూ 1064, పీఎల్ఏ 1100 రకాలు వారం రోజులు వరకూ ముంపును తట్టుకుంటాయి. ఆకులు పైకి కనిపిస్తూ 30 నుంచి 40 సెంటీ మీటర్ల నీరు నిలబడే పల్లపు ప్రాంతల్లోని మధ్యస్థ ముంపును కూడా తట్టుకుంటాయి. ఎంటీయూ 1232 రకం, 10 – 12 రోజుల పాటు తాత్కాలిక ముంపును తట్టుకుంటుంది. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరాకు 20 కిలోల యూరియా, 10 – 15 కిలోల పొటాష్ అదనంగా చల్లాలి.

రెండు నియోజకవర్గాల్లో వరి సాగు వివరాలు

మండలం	గ్రామాలు	వరి సాగు (ఎకరాల్లో)	రైతులు
రామచంద్రపురం	25	18,806	12,453
కె.గంగవరం	26	15,633	14,712
కాజులూరు	26	19,382	17,200
మండపేట	12	16,028	11,042
రాయవరం	12	14,507	12,002
కపిలేశ్వరపురం	19	15,774	14,578
మొత్తం	120	1,00,130	81,987


అంగరలో సాగు చేసిన వరిపంట

అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లోని వీఏఏలు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

–బలుసు రవి, వ్యవసాయాధికారి, కపిలేశ్వరపురం మండలం

ఘనంగా ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం


కె.గంగవరంలో కెమెరా సృష్టికర్త డాగూరే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్స్

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని మండల ఫొటోగ్రాఫర్స్ ఘనంగా నిర్వహించారు. తొలుత ఫొటోగ్రాఫర్ సృష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుందూరు పీహెచ్‌సీలో రోగులకు, వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. దీంతో పాటు కె.గంగవరంలోని భవితా కేంద్రం వద్ద ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం స్థానిక శ్రీముఖ కాలేజీ వద్ద మండల ఫొటోగ్రాఫర్స్ అందరూ సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఫొటోగ్రాఫర్స్ యూనియన్ జిల్లా నాయకులు కనికెళ్ల కనకరత్నం, ఫొటోగ్రాఫర్స్ మండల అధ్యక్షుడు పలివెల శ్రీరాములు, జిల్లా నాయకులు అంబటి సుబ్రహ్మణ్యం, గౌరవ అధ్యక్షులు సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి మోర్త సంతోష్, కోశాధికారి శీలం మణికంఠ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలకు పాల్పడితే చర్యలు

- రామచంద్రపురం ఆర్డీఓ అఖిల
- పలు విభాగాల్లో తనిఖీలు


కేదారిలంకలో పుష్కరాల రేవును పరిశీలిస్తున్న ఆర్డీఓ

కపిలేశ్వరపురం: మండలంలోని పలు శాఖల పనితీరును రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ అధికారుల పనితీరును ఆరా తీశారు. నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. తరగతి గదుల్లో శ్లాబ్ నుంచి నీరు కారడం, పెచ్చులూడటం గమనించారు. పాఠశాల గ్రాంట్ నుంచి మరమ్మతు పనులు చేపట్టాలని ఎంఈఓలు కె.తాతారావు, విజయ్‌కుమార్‌లను ఆదేశించారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు దాతల సహకారం కోసం ప్రయత్నం చేయాలని సూచించారు. అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట హెచ్ఎం సీహెచ్ రామలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు మీరితే అధికారులే బాధ్యత వహించాలి

ఇసుక అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్డీఓ హెచ్చరించారు. కపిలేశ్వరపురంలో ఇసుక ర్యాంపును ఆర్డీఓ పరిశీలించారు. ర్యాంపులో ఇసుక నిల్వల రికార్డులను తనిఖీ చేశారు. రెవెన్యూ, మైన్స్ తదితర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అక్రమాలకు తావులేకుండా ఇసుక విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. నిబంధనలను మీరితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వరద పరిస్థితి పరిశీలన....

గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఆర్డీఓ అఖిల వరద పరిస్థితిని పరిశీలించారు. కేదారిలంక పుష్కరాల రేవును, గ్రామానికి వెళ్లే కాజ్‌వేను పరిశీలించారు. వరదకు సంబంధించిన క్షేత్ర స్థాయి పరిస్థితులను సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి బలుసు రవి, తహసీల్దార్ శ్రీనివాస్, సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు వివరించారు. వరద తగ్గుముఖం పట్టే వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ అఖిల ఆదేశించారు.

పెరిగిన గోదావరి ఉధృతి


కోటిపల్లి ఫెర్రిలోని మర్రిచెట్టు మొదలు వరకు ఉధృతంగా ప్రవహిస్తున్న వరద


కోటిపల్లి రేవులో ఒడ్డుకు చేరిన పంట్లు

ఆందోళనలో గోదావరి పరివాహక ప్రజలు

కె.గంగవరం: ఎగువ నుంచి భారీగా వరద రావడంతో కోటిపల్లిలో వరద ఉధృతి పెరుగుతుంది. మండలంలోని కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు వరద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. సముద్రంలోకి వరద కలిసేందుకు ఉరకలు వేస్తూ పరవళ్లు తొక్కుతుంది. సోమవారంతో పోలిస్తే మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంట గంటకు గోదావరి పెరుగుతూనే ఉందని స్థానికులు అంటున్నారు. అయితే సాయంత్రం నుంచి గోదావరి కోటిపల్లిలో నిలకడగా ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గోదావరి ఉధృతంగా ఉండడంతో పంటు ప్రయాణాన్ని నిలిపి వేశారు. గోదావరి గట్టున ఆనుకుని కూళ్ల నుంచి కోటిపల్లి వరకు గల ఇటుకల బట్టీలు వరద నీటిలో చిక్కుకున్నాయి. లంక పొలాల్లో ఉన్న పశువులను పాడి రైతులు గట్టుకు చేర్చి కట్టారు.

నీట మునిగిన లంక పంటలు

గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో లంక భూముల్లోని పంటలన్నీ నీట మునిగాయి. మండలంలోని ముక్తేశ్వరం కాజ్‌వే వద్ద, దంగేరు శివారు పాతకోట, కొత్త కొంపలు వద్ద ఉన్న సుమారు 500 ఎకరాల్లో వేసిన వివిధ పంటలు నీట మునిగాయి. ఈ లంకల్లో కొబ్బరి, అరటి, కంద పంటలతో పాటు మిర్చి, వంగ, బెండ, ఆనప, చిక్కుడు పలు రకాల కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంటలన్నీ నీట మునగడంతో లంక రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి


మండపేటలో ఉద్యోగుల సమస్యలను ఏకరవు పెడుతున్న బాపూజీ

కపిలేశ్వరపురం (మండపేట): ఉద్యోగుల డిమాండ్లను కూటమి ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం మండపేట తాలూకా కమిటీ ఆధ్వర్యంలో "ఉద్యోగులారా రండి.! టీ తాగుతు మాట్లాడుకుందాం" నినాదంతో ప్రత్యేక కార్యాచరణను చేపట్టారు. దీనిలో భాగంగా మండపేటలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో సంఘం తాలూకా కమిటీ అధ్యక్షుడు ఎంవీవీఎస్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లు న్యాయసమ్మతమైనవి అన్నారు. డిమాండ్ల సాధనకు ఏపీజీఈఏ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలలో తక్షణమే ఎన్ని విడుదల చేస్తారో స్పష్టం చేయాలని, సరెండర్ లీవ్‌లకు సంబంధించిన నగదును చెల్లించాలని, ఉద్యోగులకు బకాయిపడిన రూ.25వేల కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తాలూకా కమిటీ కార్యదర్శి ఎ.శ్రీను, నాయకులు ఎం.మాణిక్యాలరావు, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, మత్స్య, ఐసీడీఎస్ తదితర శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ


ద్వారపూడి నీటి గుంతలో గంబూషియా చేపలను వదులుతున్న ఆరోగ్య సిబ్బంది

కపిలేశ్వరపురం: గంబూషియా చేపలు ద్వారా క్షేత్రస్థాయిలో దోమల నివారణ సాధ్యమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు ప్రాంతాల ఖాళీ స్థలాల్లోని నీటి కుంటల్లో జిల్లా మలేరియా అధికారి ఆదేశాలపై గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ జిల్లా మలేరియా విభాగం పర్యవేక్షణలో లార్వా కట్టడికి చేపలను వినియోగిస్తున్నామన్నారు. దోమల లార్వాను చేపలు తినడం ద్వారా దోమల తీవ్రత పెరుగుదను అడ్డుకుంటాయని తెలిపారు.

ద్వారపూడిలో...

ద్వారపూడి పీహెచ్‌సీ పరిధిలో పలు గ్రామాల్లో మంగళవారం రెండు వేల గంబూషియా చేపలను నీటి కుంటల్లోకి ప్రవేశపెట్టారు. పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ ఏఎం జయబాబు పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య కార్యకర్త వేమన దుర్గ, ఆశా కార్యకర్తలు ఎంఆర్ఎస్ కుమారి, కేవీ నాగమణి, పి.నాగమణి చేపలను గుంతల్లోకి వదిలారు. గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కంకటాల మురళీకృష్ణ, నీలా సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీరు వృథా


జగన్నాయకులపాలెంలో పైపు నుంచి వృథాగా లీకవుతున్న నీరు

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో పంచాయతీ పైపు లైన్ నుంచి సరఫరా చేస్తున్న తాగునీరు లీకేజీతో వృథాగా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని పాలకవర్గం, అధికారులను కోరుతున్నారు.

ఎరువుల వాడకం తగ్గించాలి


భట్లపాలిక రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

కె.గంగవరం: రసాయన ఎరువుల వాడకం తగ్గించి సమతుల ఎరువులను సిఫారసు మేరకు వాడడం వల్ల మేలైన దిగుబడులు సాధించవచ్చని ఏఓ సద్గురుమూర్తి అన్నారు. మండలంలోని భట్లపాలిక, మసకపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం క్రమేపీ తగ్గించి జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా నేల ఆరోగ్యకరంగా ఉండి పంట అభివృద్ధి చెందుతున్నారు. రైతులందరూ ఈ–పంట నమోదు రైతులు తప్పని సరిగా చేయించుకోవాలని తద్వార ప్రభుత్వం నుంచి రాయితీలను పొందవచ్చన్నారు. వరి పంట వేసిన ప్రతి రైతు బీమా చెల్లించి పంట నష్టం వాటిల్లితే ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉంటాయని సూచించారు. డివిజన్ ట్రైనర్ బాబురావు, సొసైటి చైర్మన్ గడ్డం పల్లపురావు, వీఏఏ రాజుకుమార్, వీహెచ్ సత్యవేణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు జాయింట్ల పటిష్టతకు చర్యలు


పి.గన్నవరం కొత్త అక్విడెక్టు రోడ్డుపై కొలతలు తీస్తున్న డీఈఈ

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్టుపై రోడ్డు ఎక్స్‌టెన్షన్ జాయింట్ల వద్ద తరచూ పగుళ్లు ఏర్పడటంతో, ఆ గోతుల్లో వాహనాలు పడి ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. దీంతో జాయింట్ల వద్ద పటిష్టత చర్యలు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్టు ఇరిగేషన్ డీఈఈ భూపతిరాజు రవిప్రసాద్‌రాజు తెలిపారు. జాయింట్ల మధ్యలో స్ట్రిప్ స్టీల్ షీట్లను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన వివరించారు. దీనికి సుమారు రూ.20 లక్షలు ఖర్చవుతుందని ఆయన వివరించారు. అక్విడెక్టు రోడ్డుపై మంగళవారం ఆయన కొలతలు తీశారు. ఇరిగేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలు బాబు డిక్షనరీలో లేదు


పల్లిపాలెంలో నాయకులతో కలసి జెండావిష్కరణ చేసిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ఎన్నికల హామీలను అమలు చేయడం చంద్రబాబు డిక్షనరీలో లేదని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం మండలం గూడపల్లి, పల్లిపాలెం గ్రామాల్లో పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పున్నం నాగేశ్వరావు అధ్యక్షతన, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, కోరుకొండ రవి అధ్యక్షతన, సర్పంచ్ నరసింహస్వామి నాయకత్వంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీలో భాగంగా ఇంటింటికీ వంచన ప్రచారం జరిగింది. గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు ఏడాదిగా ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, మహిళలకు స్త్రీనిధి పథకం ద్వారా ఇస్తానన్న నెలకు రూ.1500 ఇవ్వకుండా, మహిళలను చంద్రబాబు మోసం చేశారన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఒక్క హామీ కూడా అమలు చేయకుండా సంవత్సరం గడిపేసారని, చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తొలుత స్థానిక నాయకులతో వైఎస్సార్ సీపీ పతాకాన్ని గొల్లపల్లి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు బ్రహ్మాజీ, మండపేట పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, గుబ్బల మనోహర్, సహదేవ్, చింత ప్రసాద్, మోకా సురేష్, ఉచ్చుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొత్తపేట: విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.కేపీ రాజు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉన్నత విద్యా మండలి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం అడ్మిషన్లు ఈనెల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థులంతా వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల ఆఫీసులో లేదా 9704302775, 8179824845, 9490186830, 9989027808. నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు కోరారు.